


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక **వార్త**




## ముక్కంటీశుని ఆలయ ఇఓ

# నియామకంపై సందిగ్ధత



### ఉన్న వారికా? కొత్త వారికా?

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి కొత్త ఇవో వస్తారా? లేక ప్రస్తుతం ఫుల్ అడిషనల్ చార్జిగా ఉన్న అధికారే కొనసాగుతారా? ఇంతకు శాసనసభ్యులు ఎవరికి ఉత్తరం ఇచ్చారు? అనేది చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంటుంది. అయితే ఇక్కడకు రావటానికి కొందరు అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు, పైరవీలు సాగిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి ప్రభుత్వం ఏ నియోజకవర్గంలో అయినా అధికారులను నియమించాలంటే ఆ ప్రాంత శాసనసభ్యుని అనుమతి తప్పని సరి చేసింది. దాంతో అధికారుల నియమకాలు ఆయా ఎంఎల్ఏల మీద ఆధారపడి ఉంది. శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదాయాలు సుమారు రూ.200కోట్లుకు పెరిగింది. అంతేకాక ఇక్కడ ప్రధాన రాబడి రాహుకేతుదోష నివారణ పూజల ద్వారా వస్తుంది.

**గోపాల్‌రెడ్డి హయాం నుంచి ఐఏయస్‌ల నియామకానికి యత్నం**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఆదాయాలు గణనీయంగా పెరుగుతూ ఎప్పటికప్పుడు భక్తుల రాక పెచ్చుపెరిగి పోతుండటంతో 2009 నుంచి అప్పటి మంత్రి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ ఆలయానికి శిక్షణ పొందుతున్న ఐఎయస్‌లను నియమించి ప్రగతి పనులు వేగంగా చేపట్టాలని యోచించారు. ఈ విషయాన్ని అప్పటిలో ఆయన ప్రస్తుత సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి కూడా తెచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే 2017లో 'మాస్టర్‌ప్లాన్' అమలుకు ప్రభుత్వం నుంచి అనుమతి సాధించారు. సుమారు మొదటి దశలో రూ.200కోట్లతో చేపట్టే అభివృద్ధి పనుల్లో పారదర్శకత, జవాబుదారి తనం క్రమశిక్షణ కల్గిన అధికారి అవసరాన్ని ప్రస్తుత శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి యోచిస్తున్నారు. ఇక్కడ పట్టుదలగా పని చేసే అధికారి కావాలని ఎంఎల్ఏ అన్వేషిస్తున్నారు. అయితే ఇక్కడ పని చేయటానికి మొదట దేవాదాయశాఖలో పని చేస్తున్న అజాద్‌పేరు తెరమీదకు వచ్చింది. అయితే కొందరు ఎంఎల్ఏ సన్నిహితులు ఆయనతో పరిపాలన కష్టం అని గతంలో పని చేసిన చోట వివాదాలున్నాయని వివరించారు. ఇక ఇక్కడ గతంలోపని చేసిన ఇద్దరు అధికారులు మళ్ళీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సాగర్‌బాబు తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. అయితే గతంలో ఇక్కడ ఆర్‌డిఓగా పని చేసి కొంత కాలం ఇన్‌చార్జి ఇఓగా పని చేసిన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో పని చేస్తున్న రామారావు ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఆయన డిసెంబర్‌లో ఉద్యోగ విరమణ చేస్తున్నందువల్ల ప్రణాళికలు పథకాలు అమలు జరిపే సామర్థ్యం గల అధికారి కావాలని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖలో అర్హత కల్గిన అధికారులు లేదు. కాబట్టి తప్పని సరిగా ఇతర శాఖల వారికి అవకాశం ఇవ్వక తప్పదు. కాబట్టి ఎవరు వస్తారనేది పట్టణంలో హాట్ టాపిక్‌గా మారింది.

## రేణిగుంట విమానాశ్రయానికి

# విదేశీ విమానం

### స్వాగతం పలికిన బీజేపీ, టీడీపీ నేతలు






ప్రవాస భారతీయులకు స్వాగతం పలుకుతున్న కోలా ఆనంద్, తదితరులు

విమానాశ్రయంలో విదేశీ విమానం

రేణిగుంట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:

రేణిగుంట(తిరుపతి) విమానాశ్రయానికి ఆదివారం మధ్యాహ్నం విదేశీ నుంచి విమానం వచ్చింది. అంతర్జాతీయ విమానాశ్రయానికి ఎక్కువ దూరం ప్రయాణించిన తొలి ప్రత్యేక విదేశీ విమానం కావడం విశేషం. ఈ విమానం బెహరీన్ నుంచి భారత కాలమానం ప్రకారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి రేణిగుంట విమానాశ్రయానికి మధ్యాహ్నం 12.11 గంటలకు చేరుకుంది. సుమారు 4.43 గంటలకు ప్రయాణంచేసి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న తొలి విదేశీ విమానంగా విమానాశ్రవర్గాలు అంటున్నాయి. విమానంలో ప్రవాస భారతీయులు రవిచంద్రన్‌పిళ్లై, ఆయన సతీమణి తోపాటు రవీంద్రపిళ్లై, రేణిగుంట చేరుకున్నారు. విమానాశ్రయంలో వారికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనందకుమార్, టీడీపీ నేత రేణిగుంట పుర ప్రముఖులు ధర్మరాజులు, ఆయన సోదరుడు గోపాలకృష్ణ(శీను) వారి మిత్ర బృందం ఘనంగా స్వాగతం పలికారు. విదేశీ విమానం రేణిగుంట విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ అయిందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ మన్నె శ్రీనివాసరావు తెలిపారు.

విమానం సేఫ్‌గా ల్యాండ్ అవడానికి సహకరించిన సీఐఎస్ఎఫ్, కస్టమ్స్, ఇమ్మిగ్రేషనన, గ్లోబల్ గ్రౌండ్ హాండ్లింగ్ అధికారులకు అభినందనలు తెలియజేశారు.

## సైకత శిల్పంతో పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు




గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా గూడూరు నియోజకవర్గం శ్రీనివాస సత్రం సముద్రతీరంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో ఆదివారం సైకతశిల్పి మంచాల సనత్ కుమార్ పవన్ కళ్యాణ్ సైకత శిల్పాన్ని ఏర్పాటు చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యమ్రానికి అతిథులుగా నెల్లూరు నగర అధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్ బాబు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చింతలూరు సుందర్ రామిరెడ్డి పాల్గొని ఇంతటి గొప్ప శిల్పాన్ని రూపొందించిన శిల్పిని అభినందించి శాలువతో ఘనంగా సన్మానించారు. వారితో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ పీఓసి మోహన్, నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లడ్డూ దళారీలకు చెక్‌పెట్టేస్తాం!

**-దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి తగినన్ని లడ్డూలు**

**-టిటిడి ఈఓ శ్యామలరావు,అదనపు ఈఓ చౌదరి**



తిరుమల, సెప్టెంబర్ 01 ప్రభాతవార్తప్రతినిధి:

దేవదేవుని దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి తగినన్ని లడ్డూలు విక్రయిస్తున్నామని, దళారీలను పూర్తిగా నియంత్రించేందుకే చర్యలు చేపట్టామని టిటిడి ఈఓ జె.శ్యామలరావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. లడ్డూలకోసం భక్తులు ఎవరూ కూడా ఇబ్బందులు పడే పరిస్థితి ఉండదన్నారు. దర్శనం చేసుకున్న ప్రతి భక్తునికి ఒక ఉచిత లడ్డూతోబాటు 50రూపాయలు అదనపు లడ్డూలు అవసరమైన మేరకు విక్రయించేలా ఆదేశాలిచ్చామన్నారు. ప్రతిరోజూ 3.50లక్షల లడ్డూలు భక్తులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. లక్షలడ్డూలు ఎలాంటి దర్శనం టోకెన్ లేకుండా కొనుగోలుచేస్తున్నారని గుర్తించామన్నారు. ఆధార్‌కార్డు ఆధారంగా ఒక్కొక్కరికి 2లడ్డూలు మాత్రమే విక్రయించాలని ఆదేశాలిచ్చామన్నారు. ఆదివారం సాయంత్రం అన్నమయ్య భవనంలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, సివిఎస్ఓ ఎస్.శ్రీధర్‌తో కలసి మీడియాప్రతినిధులకు వివరాలు వెల్లడించారు.

## నేడు ఎస్వీయూలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

**కాంతుల వెలుగులో ఎస్వీయూ పరిపాలన భవనం**



వార్త 4వ పేజీలో

## పాత పెన్షన్ విధానం మాత్రమే ఆమోదయోగ్యం

**- కలెక్టరేట్ ఎదుట ఎస్టీయు ఆధ్వర్యంలో నిరసన**



చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

పాత పెన్షన్ విధానంను పునరుద్ధరణ ఒక్కటే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమని, మిగిలిన ఏ విధానంను తమపై రుద్దడానికి ప్రయత్నించదవద్దని రాష్ట్రోపాధ్యాయ సంఘం(ఎస్టీయు) చిత్తూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. రాష్ట్ర ఎస్టీయు నాయకత్వం పిలుపుమేరకు చిత్తూరు జిల్లా ఎస్టీయు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్టీయు నాయకులు మాట్లాడుతూ సిపిఎస్ విధానానికి యుపిఎస్ అనే ముసుగు వేసి అమలు చేయాలనుకోవడం సరికాదని స్పష్టం చేశారు. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ఉద్యోగుల జీవన భద్రతకు గొడ్డలిపెట్టులా మారిన నూతన పెన్షన్ విధానంను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పాత పెన్షన్ విధానంను బేషరతుగా పునరుద్ధరించాలని ఎస్టీయు నాయకులు డిమాండ్ చేశారు. పెన్షన్ పొందడం భిక్ష కాదని, ఉద్యోగి హక్కు అని సుప్రీంకోర్టు నిష్పష్టంగా పేర్కొన్నప్పటికీ దానికి విరుద్దంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని ఆదేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానంను పునరుద్ధరించే వరకు ఉద్యమాలు కొన సాగుతూనే వుంటాయని నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎస్టీయు నాయకులు గంటామోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్మోహన్‌రెడ్డి, బోడే ప్రసాద్‌లు, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, పురుషోత్తం, జనార్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు పోతిరెడ్డి రమణారెడ్డి, యువరాజు, చంద్రన్, చిట్టిబాబు, నరేంద్ర, చైతన్య, కిషోర్, సుబ్రమణ్యంపిళ్ళై, బాబురెడ్డి, సుబ్రమణ్యం, గణేష్, గుణశేఖర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## సీమలో జనసేన పార్టీని విస్తరింపచేయాలి

**ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**



తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

రాయలసీమలోని ప్రతి నియోజకవర్గంలో జనసేన పార్టీని విస్తరింపు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. రాష్ట్ర దశ, దిశను నిర్దేశించే ఏకైక నాయకుడు పవన్ కళ్యాణ్ అని ఆయన అన్నారు. జనసేన అధ్యక్షులు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ముందస్తు జన్మదిన వేడుకలు తిరుపతిలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో వేడుకగా నిర్వహించారు. జనసేన నాయకులు వూసా మాధవ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కేక్ కట్ చేసి పవన్ కళ్యాణ్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో ఎక్కువ మందిని చేర్పించిన వారికి షీల్డ్ ఇచ్చి సన్మానించారు. ఆరణి మదన్ మోహన్ 1047 మందిని చేర్పించి మొదటి స్థానంలో నిలవగా ఆయన స్థానంలో ఆరణి శివకుమార్ షీల్డ్ అందుకున్నారు. దినేష్ జైన్ 1011 మందని చేర్చి రెండో స్థానంలో, రిటైర్డ్ తహాశీల్దార్ నరసింహులు నాయుడు 771 మందిని చేర్పించి మూడో స్థానంలో, 522 మందిని చేర్పించి ఆముదాల వెంకటేష్ రాయల్ నాలుగో స్థానంలో, 505 మందిని పార్టీలో చేర్చించి వూసా మాధవ రావు ఐదవ స్థానంలో నిలిచి ఎమ్మెల్యే నుంచి షీల్డ్ అందుకున్నారు. జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదులో రాయలసీమలో తిరుపతి మొదటి స్థానంలో నిలివడం వెనుక జనసైనికల పట్టుదల సంతోషాన్నిచ్చిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గత ఏడాది 4954 మంది జనసేన సభ్యత్వం తిరుపతి నుంచి తీసుకుంటే ఈ ఏడాది 16011 మంది సభ్యత్వం తీసుకున్నారు. రాయలసీమలోని అన్ని నియోజకవర్గాలకు జనసేన పార్టీని విస్తరింప చేయాలని ఆయన జనశ్రేణులను కోరారు. జనసేన పార్టీ ఆవిర్భావం తరువాత అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తోందని ఆయన వివరించారు. 2019లో ఒక సీటు గెలిచిన జనసేన 2024లో పోటీ చేసిన 21 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను గెలిచి దేశ ఎన్నికల చరిత్రలో ఒక రికార్డు నెలకొల్పిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరిప్రసాద్, ఆరణి శివకుమార్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, కీర్తన, ఆకేపాటి సుభాషిణి, ముక్కు సత్యవంతుడు, నైనార్ శ్రీనివాస్, కార్పొరేటర్ సత్యనారాయణ, రాజేష్ ఆచ్చారి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం ఆదేశాలతో కుప్పంలో కంటి వెలుగు

**- పెద్ద ఎత్తున కంటి వైద్య శిబిరాలు.. ఉచిత ఆపరేషన్లు.. కళ్లద్దాలు పంపిణీ !!**

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

మనిషికి భగవంతుడు ప్రసాదించిన ఇంద్రియాల్లో నయనం (కన్ను) అనేది ఎంతో కీలకం. నేడు సమాజంలో ఎంతో మంది కంటి చూపు కోల్పోయి పడుతున్న బాధలు వర్ణనాతీతం. అలాంటి కంటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు ముందుగానే వారికి ఉన్న కంటి సమస్యను గుర్తించి వారికి అవసరం ఉంటే ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహించడం, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేసే మహత్తర కార్యక్రమానికి సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో అధికారులు శ్రీకారం చుట్టారు. అదే కంటి వెలుగు కార్యక్రమం. గత నెల రోజులుగా జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచనలతో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటా సర్వే చేపట్టి కంటి సమస్యలతో బాధపడుతున్న సుమారు 5750మందిని గుర్తించారు. వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు కుప్పం, గుడుపల్లె, రామకుప్పం, శాంతిపురం, కుప్పం మున్సిపల్ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ఉచిత కంటి వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కుప్పం మండలం మల్లానూరు, పైపాళ్యం, కుప్పం మున్సిపాలిటీ, శాంతిపురం మండలంలో శాంతిపురం, రాళ్లబూదుగూరులో వైద్య శిబిరాలు నిర్వహించారు. అలాగే రామకుప్పం మండలాల్లో ఈ వైద్య శిబిరాలు ముగిశాయి. సెప్టెంబర్ 2న కుప్పం మండలం కంగుంది, కొత్తపల్లి, 3వతేది గుడుపల్లె మండలం గుడికొత్తూరు, గుడుపల్లెలో వైద్య పరీక్ష శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరాలకు హాజరయ్యే ప్రజలకు అధికార యంత్రాంగం భోజనం, తాగునీరు, రవాణా సౌకర్యం కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ శిబిరాలకు హాజరై వైద్య పరీక్షలు పొందిన వారిలో ఇప్పటికే సుమారు 750మందిని ఆపరేషన్ల నిమిత్తం వైద్యాధికారులు ఎంపిక చేశారు. అలాగే మరో 2300మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయాల్సి ఉందని నిర్ణయించారు. కుప్పం ప్రాంతంలో సిఎం చంద్రబాబు ఆదేశాలతో ప్రభుత్వం తరపున ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కాలంగా కంటిచూపు సరిగ్గా లేదని తనకు వైద్యులు పరీక్షించి ఉచితంగా రెండుకళ్లకు ఆపరేషన్ చేస్తామని పేర్కొన్నారని తద్వారా తనకు కంటి చూపు వస్తుందని చీలేపల్లికి చెందిన మునెప్ప (38) పేర్కొన్నాడు. ప్రభుత్వం తరపున వైద్య శిబిరం ఏర్పాటుచేసి ఎంతోమందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందిస్తుండడం పట్ల పరమసముద్రంకు చెందిన వెంకటమ్మ(56), కుప్పంకు చెందిన బేబమ్మ (62) ఆనందం వ్యక్తం చేశారు.



**ముఖ్యమంత్రి ఆదేశాలతో ప్రత్యేక శిబిరాలు - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్**

సిఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పం నియోజకవర్గంలో ఇంటింటా సర్వే చేపట్టి కంటి సమస్యలు ఉన్న వారిని గుర్తించాము. సెప్టెంబర్ 3వతేది వరకు ప్రత్యేక కంటి పరీక్ష శిబిరాలు నిర్వహించి అనంతరం ఉచితంగా ఆపరేషన్లు చేయించడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వం తరపున ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడం జరుగుతుంది.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుప్పం ప్రజలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో నియోజకవర్గంలో కంటివెలుగు కార్యక్రమం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కంటి సమస్యలతో బాధపడేవారిని గుర్తించి వారికి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాము. ప్రజలు అపోహలకు లోను కాకుండా అవసరమైన వారు ఆపరేషన్‌చేయించుకుని కంటిచూపును కాపాడుకోవాలి.






## తెలుగుదేశంతోనే అభివృద్ధి

### - ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యం లో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొ న్నారు. బెంగళూరులో జరిగిన బెంగళూరు టిడిపి ఫోరం 11వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జగన్మోహన్ నాయుడు పాల్గొన్నారు. బెంగళూరులోని కెఆర్ పురం వద్ద వున్న ఎంబిటి శుభమీరు కళ్యాణ మండ పంలో నవశకం-మంచిరోజులు వచ్చేశాయి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ బెంగళూరు లోని తెలుగువారి సమస్యలను పరిష్కరించడంతో పాటు చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని తెలుగుదేశం జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తనకు చిత్తూరు తెలుగు దేశం అభ్యర్థిత్వం కేటాయించారన్నారు. గత11సంవత్సరాలుగాబెంగళూరుటిడిపిఫోరం పార్టీకి సంబంధించి నిర్వహించిన అనేక విజయవంతంగా నిర్వహించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మంత్రి సవితమ్మ, ఎమ్మెల్సీ రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పారిశ్రామికవేత్త అమిలినేని సురేంద్ర, మాజీ ఎమ్మెల్యే బగ్గిడి గోపాల్, మోహన్‌చౌదరి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## నందమూరి నిజమైన వారసుడు బాలకృష్ణ

పుంగనూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :



నందమూరి కుటుంబ నిజమైన వారసుడు బాలకృష్ణ అని ఎన్టీఆర్ అభిమానుల సంఘ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అప్పిరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాలకృష్ణ 50వ సినీ ప్రస్థాన వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. దేశం నాయకుడు మోహన్‌రెడ్డి అధ్వర్యం లో అన్నదానం నిర్వహించారు. డాక్టర్ అప్పిరెడ్డి మాట్లాడుతూ బాలయ్య సినీ ప్రస్థాన స్వర్ణోత్సవాల సందర్భంగా రెండురూపాయలకే వైద్యసేవల వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గురువారం గ్రామాలకు వచ్చే ఈవాహనం ద్వారా ప్రజలకు రెండు రూపాయలకే వైద్యం అందచేస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సివిరెడ్డి, మాధవరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులకు ఆహ్వానం

కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తూ దేవస్థానం అధికారులు అహ్వాన పత్రికలను అందజేశారు. దేవస్థానలో ఈనెల 7 నుండి 27 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ గురుప్రసాద్‌లు స్థానిక టీడీపీ నాయకులతో కలసి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డిలను అహ్వానిస్తూ బ్రహ్మోత్సవ ఆహ్వానపత్రికలను అందజేశారు. అలాగే వారికి దేవస్థానం తరపున అర్చకులు, వేపదండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసా గర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, టీడీపీ నాయకులు అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎస్ఐకు సత్కారం

.తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



మండల ఎస్ఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కె.ఈశ్వరయ్యను మండల తెలుగుదేశంపార్టీ మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలు అందించారు. మండలంలో ఇసుక మాఫియా యంత్రాల సాయంతో రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని అలాంటి వారిపై నిఘాపెట్టి అక్రమరవాణా అరికట్టాలని ఎస్ఐని కోరారు. కార్యక్రమంలో ఓబిసి యువమోర్చా అధ్యక్షులు ఎస్వీరమణ, బిజెపి మండల కార్యదర్శి వేడాం.కృష్ణయ్య, రమేష్, కుమార్, రవి ఆచారి, పాల్గొన్నారు.

**ఎస్‌ను సత్కరించిన వాసుదేవనాయుడు..**

తొట్టంబేడు ఎస్ఐ కె.ఈశ్వరయ్యను మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా వాసుదేవనాయుడు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు, ఇసుక తరలింపుపై దృష్టిసారించాలని ఎస్ఐని సూచించారు.

## కుప్పంలో ఆటోనగర్ ఏర్పాటుకై ముమ్మర చర్యలు

### - మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్

కుప్పంరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



కుప్పంలో కార్మికుల సౌకర్యార్థం ఆటోనగర్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ సూచనలతో ముమ్మర చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక చంద్రన్న కార్మిక భవనంలో జరిగిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే ఆటోనగర్ ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేశారన్నారు. త్వరలోనే స్థలం ఫైనలైజ్ చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కార్మిక భవనం పక్కనే గల ఖాళీ ప్రాంతంలో అన్ని వర్గాల కార్మికుల సౌకర్యార్థ ం మరో భవనం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. కార్మికులు ఐకమత్యంతో ముందుకుసాగాలని కోరారు. అంతకుముందు పెయి ంటర్స్ కార్మికులతోను ఆయన చర్చించారు. వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తప్పక తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, కార్మిక సంఘం అధ్యక్షుడు శివకుమార్, హరి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

రామకుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

మండలంలోని పులిమడుగు తాండా సమీపంలో ఆదివారం రెండు టువీలర్లు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. బీరప్ప (28) అనే వ్యక్తి పల్లికుప్పం వైపు టువీలర్‌లో వస్తుండగా ఎదురుగా మార్గమధ్యంలో టు వీలర్‌లో వస్తున్న చంప్లానాయక్ (55) వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో చంప్లనాయక్ కుడికాలు విరగగా బీరప్పకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇద్దర్నీ 108లో కుప్పం ఆస్పత్రికి తరలించారు.

## నేడు విద్యాసంస్థలకు సెలవు

### - కలెక్టర్ సుమిత్‌కుమార్

**చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం వుండటంతో జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు, జూనియర్‌కళాశాలలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు హాజరై తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవచ్చునన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులందరు తప్పక హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే నియోజకవర్గ, మండల స్థాయిల్లో సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

మద్యం సేవించి ద్విచక్రవాహనాలు నడిపిన 8 మందికి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు శనివారం 80 వేల రూపాయల జరిమామా విధించిందని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నిత్యబాబు తెలిపారు. చిత్తూరు నగర పరిధిలో వాహనాల తనిఖీ సమయంలో 8 మంది ద్విచక్రవాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని, వీరిని శనివారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు ఎదుట హాజరుపరిస్తే జడ్జి ఉమాదేవి వాహనదారులు ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించారని తెలిపారు. ఈ 9 నెలల వ్యవధిలో చిత్తూరు నగర పరిధిలో ఇప్పటి వరకు ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన 290 మంది నుండి ఇప్పటి వరకు 22.80 లక్షల రూపాయల జరిమానాలు వసూలు చేయడం జరిగిందని వివరించారు. మద్యం సేవించి వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే సెక్షన్ 185 కింద మొదటిసారి మొదటి సారి నేరం చేస్తే రూ.10 వేలు జరిమానా లేదా 6 నెలల జైలు శిక్ష లేదా ఈ రెండు విధించవచ్చునన్నారు. అలాగే రెండవ సారి నేరం చేసి పట్టుబడితే రూ.15 వేలు జరిమానా లేదా 3 సంవత్సరాల జైలు లేదా రెండు శిక్షలు విధించవచ్చునన్నారు.

## నేడు పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్

**చిత్తూరు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి సోమవారం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీస్ పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంత చందోలు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుండి జరిగే ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రజలు హాజరై తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి సంబంధిత ఆ సమస్యలను పరిశీలించి సత్వరం పరిష్కరించాల్సిందిగా సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించడం జరుగుతుందని ఎస్పీ మణికంత చందోలు పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విషసర్పం కాటేసి వ్యక్తికి అస్వస్థత

### -అందుబాటులోని వైద్యులు



చౌడేపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

విషసర్పం కాటేసి ఓ వ్యక్తి అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసు కొంది. మండంలోని పెద్దకొండామర్రి పంచాయతీ కోటూరుకు చెందిన హిదాయితులా (48)వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళాడు. అక్కడ పనిలో నిమగ్నమై వుండగా విషసర్పం కాటేసింది. అపస్మాకర స్థితిలో పడున్న హిదాయితుల్లాను గుర్తించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌ఓ, అటెండర్ మాత్రమే వైద్యం చేశారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి సిఫారస్సు చేసారు.

**డిఎంహెచ్‌ఓ ఆదేశాలు బేఖాతర్ :** జిల్లా వైద్యాధికారిణి ప్రభావతి ఆదేశాలను స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బేఖాతర్ చేసారు. ప్రతి ఆదివారం వైద్యాధికారులు మధ్యాహ్నం 12.30గంటల వరకు ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుబాటులో వుండాలని ఆదేశాలు జారీ చేసివున్నారు. విషసర్పం కాటుకు గురైన హిదాయితుల్లా ఆరోగ్య కేంద్రానికి ఉదయం 10.45గంటలకు వచ్చాడు. అయితే వైద్యులు లేకపోవడంతో ఎంఎల్‌హెచ్‌ఓ ధరణి, అటెండర్ నూమాన్‌లు రోగికి వైద్యం చేసి, బయట ప్రాంతానికి సిఫార్సు చేసారు. ఇకనైనా ఉన్నతాధికారుల ఆదేశాలు స్థానిక వైద్యులు పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

## వీనులకు ఆనందమయం-సౌందర్యలహరి పారాయణం

పుదిపట్ల(చౌడేపల్లి), సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో నిర్వహించిన సామూహిక సౌందర్యలహరి పారాయణం వీనులకు విందు చేసింది. ఉదయాన్నే అమ్మవారికి వేద పండితులు, అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో విశేషాభిషేకం, అలంకరణగావించారు. సౌందర్యలహరి పారయణ పండితురాలు(హైదరాబాదు) లక్ష్మీసరస్వతి ఆధ్వర్యంలో చౌడేపల్లి, పుంగనూరుకు చెందిన ఆర్యవైశ్య మహిళలు స్థానికులు సామూహిక సౌందర్యలహరి పారాయణం, శ్రీచక్ర విశిష్టతను వివరించారు. అధిక సంఖ్యలోవచ్చినభక్తులకుఆలయనిర్మాణకర్తవినోద్‌కుమార్‌రెడ్డిఅన్నప్రసాదం, పవిత్రతీర్థ ప్రసాదాలందించారు.

## కుప్పం సబ్‌డివిజన్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు - డిఎస్పీ పార్థసారథి

కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



కుప్పం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెప్టెంబర్ 30వతేది వరకు 30 పోలీస్ యాక్ట్‌ను జిల్లా ఎస్పీ మణికంత చందోలు ఆదేశాలతో అమలు చేస్తున్నట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కుప్పం అర్బన్, గుడుపల్లె, రాళ్లబూదుగూరు, రామకుప్పం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఈ యాక్ట్ అమలులో ఉంటుందన్నారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావే శాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. అలా నిర్వహించాలనుకుంటే పోలీసు శాఖనుంచి ముందస్తు అనుమతులు తప్పక తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు కూడా తమవంతు సహాయ సహకారాలు అందించాలని డిఎస్పీ కోరారు.

## అదుపు తప్పి కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

కుప్పంరూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



కుప్పం - వేపనపల్లి మార్గంలో మండలంలోని గంగాపురం వద్ద ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి నష్టం జరగలేదు. బెంగళూరుకు చెందిన కొందరు కెఎ03ఎన్‌పి 3433నెంబరు గల కారులో కుప్పం వైపు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా : సిఐ

వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సిఐ వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సిబ్బందితో కార్డ్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి తిరిగి రిజిస్టర్ లేని వాహనాలను గుర్తించారు. అపరిచితులే ఎవరైనా వచ్చి ఉన్నారా అని ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ లేని వాహనాలను నడిపితే చర్య తీసుకుంటామని హెచ్చరించారు. పలు వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాయక్, కామినేని గోపి సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ వాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



పట్టణ వాసులకు పరిశుభ్రమైన నీటిని సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ద్వారా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి మండలం గుళ్ళ సముద్రం గ్రామం సమీపంలో పట్టణానికి తాగునీరు అందించే ట్యాంకును చైర్పర్సన్ నక్క భానుప్రియ, కౌన్సిలర్లతో కలిసి ఆయన పరిశీలించారు. పట్టణవాసులు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి రోజు నీటిని పరిశీలించి శుభ్రం చేసి అందజేస్తామన్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో గ్రామ శక్తి పోలేరమ్మ జాతర ఉన్నందున తాగునీటి సరఫరా ఇబ్బంది లేకుండా చెడిన మోటర్‌ను బాగు చేస్తామని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వవెంట కమిషనర్ అబ్దుల్ నజీర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి. నాగేశ్వర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నందు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా జనసేన నాయకులు ప్రభుత్వ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరం ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు సినీ నటుడు, సిని నిర్మాత, దర్శకుడు, జనసేన రాజకీయ పార్టీ వ్యవస్థాపకుడు అతను 2024లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికలలో పిఠాపురం నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ బాధ్యతలు చేపట్టారు. తెలుగు సినిమాలో తన విలక్షణమైన శైలి, వ్యవహారశైలిక ప్రసిద్ధి చెందాడు. అతను తెలుగు రాష్ట్రాల అంతటా భారీ అభిమానులను కలిగి ఉన్నా తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు అనిల్ కుమార్, జనసేన జిల్లా కార్యదర్శి చాముండ్రి రాధమ్మ, జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆరువ రాజేష్, వెంకటగిరి పట్టణ ఉపాధ్యక్షుడు కోన రవిశంకర్, జనసేన పార్టీ వెంకటగిరి పట్టణ కార్యదర్శి కేశంశెట్టి వెంకటేశ్వర రావు, వెంకటగిరి నియోజకవర్గ జనసేన (పిఒసి) తోట కృష్ణయ్య, రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వర రావు, మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ ఏఎంసి డైరెక్టర్ పులుకుల్లా రాజేశ్వర రావు, టిడిపి రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్, మేఘన వాటర్ అధినేత జంపాల ప్రకాష్, ఏపిపి, ప్రకృతి కుమార్, ఐదవ వార్డు కౌన్సిలర్ నారి శేఖర్, మాజీటిడిపికౌన్సిలర్ చెంగారావు, నాయకులు మోహన్, వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకి వినతి

**వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** పట్టణంలోని 14వ వార్డు టెలిఫోన్ ఎక్స్ఛేంజి నుండి బొగ్గులు మెట్ట వరకు విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కౌన్సిలర్ ఆరి శంకరయ్య వినతి పత్రం అందజేశారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని రెండు సంవత్సరాల క్రితం అప్పటి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డికి వినతి పత్రం అందజేయగా ఆయన మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యుత్ స్తంభాలు లేక వీధిలైట్లు వేయలేదని తెలిపారు. చీకట్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. విద్యుత్ స్తంభాలు వేయిస్తామని ఎమ్మెల్యే రామకృష్ణ హామీ ఇచ్చారు.

## విధుల నుండి తొలగించరాదని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన



**వెంకటగిరి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** బ్రాందీ షాపుల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించరాదని వారు పట్టణ పురవీధుల్లో నిరసన ర్యాలీ చేశారు. ఐదు సంవత్సరాల నుండి పనిచేస్తున్నామని కొత్త మద్యం పాలసీతో తమ ఉద్యోగాలు పోతాయని ఆందోళన చెందారు. తమకు వచ్చే జీతంతో తమ కుటుంబ సభ్యులు బతుకుతున్నామని తెలిపారు. నిరసనలో పలువురు ఔట్సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర భారతి కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం

గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త



గూడూరు రెండవ పట్టణ పరిధిలోని స్వర్ణాంధ్ర భారతి జూనియర్ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక హారిక కంటి వైద్యశాల డాక్టర్ హారిక రెడ్డి మల్లెమాల విద్యార్థులకు ఐ స్క్రీనింగ్ చేశారు. అవసరమైన విద్యార్థులకు ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినందుకు కళాశాల ప్రతినిధులు డాక్టర్ హారిక రెడ్డి మల్లెమాలకి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్లు నిరంజన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రేణుక ధన్యవాదాలు చెప్పారు. అనంతరం కళాశాల యాజమాన్యం హారిక రెడ్డిని ఘనంగా సత్కరించారు.

## వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్‌చే

### తల్లి, పిల్ల ఆరోగ్య ప్రాజెక్టు కార్యక్రమం విజయవంతం



**గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** గూడూరు గాంధీనగర్‌లోని వసంత లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో తల్లి, పిల్లల ఆరోగ్య ప్రాజెక్టు విజయవంతంగా నిర్వహించారు. ఈ ప్రాజెక్టు రైట్స్ సంస్థ యొక్క సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మద్దతు పొందారు. ఈ ప్రాజెక్టు యొక్క ప్రధాన లక్ష్యం బీపీఎల్ కుటుంబాలకు ఆరోగ్య పరిరక్షణ, మద్దతును అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తల్లులు, పిల్లల ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు వివిధ రకాల స్క్రీనింగ్, డయాగ్నస్టిక్ సేవలు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన మందులు, పోషక పదార్థాల కిట్లను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది తల్లులు, పిల్లలు, 100 మంది వృద్ధులు పాల్గొన్నారు. ప్రసిద్ద వైద్యులు పిడియాట్రీషియన్ డా. మాల్యాద్రి, గైనకాలజిస్టు డా. విజయలక్ష్మి, జనరల్ ఫిజీషియన్ డా. సంపత్ పాల్గొని తమ వైద్య సేవలను అందించారు.

## సూళ్లూరుపేటలో పవన్ జన్మదిన వేడుకలు

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్నారని, ఆయనకు అందరూ తోడ్పాటు అందించాలని కోరారు. మన్నారుపోలూరు రోడ్డు మరమ్మతుల కోసం పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెప్పారు. అనంతరం ఆమె అభిమానులతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. టిడిపి నేతలు మాధవనాయుడు, చిట్టేటి పెరుమాళ్లు, రాజసులోచనమ్మ, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్, ఎస్‌కె మాబాషా, ఆవుల రమణ, జగదీష్, కోటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**వాసవీ క్లబ్‌చే రక్తదాన శిబిరం**

సూళ్లూరుపేటలోని వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ వాసవీ వారంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక నారాయణ హైస్కూలులో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ వనితా క్లబ్‌లకు చెందిన బందారు శబరీష్, ఛైర్మన్ సాయిరామ్, సునీత, అభిషేక్, శ్యాంసుందర్, పద్మజ, కళావతి, శైలజ, గుర్రం ప్రసాద్, ముని విజయమోహన్, కొత్తూరు ప్రకాష్, గూడూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ డాక్టర్లు సందీస్, శ్రీనివాస్, సుధీర్, హేమంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. యధుమధి ఇంటిగ్రేటెడ్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ వారి సహకారంతో ఈ శిబిరం నిర్వహించారు.

## లయన్స్ క్లబ్‌చే అన్నదానం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదానం నిర్వహించారు. క్లబ్ కోశాధికారి అప్పారావు జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, జోన్ ఛైర్మన్ ఆదిశేషారెడ్డి సహకారంతో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వైన్ షాపు వర్కర్స్ ర్యాలీ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, వర్కర్లు, వాచ్‌మెన్లు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక హోలీక్రాస్ జంక్షన్ నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## నేడు ఓజిలిలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం



నాయుడుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ఓజిలిలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓజిలి మండల వైసీపీ కన్వీనర్ పాదర్తి హరినాథరెడ్డి తెలిపారు. ఓజిలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నివాళి అర్పిస్తామని ఆయన తెలిపారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మద్యంషాపుల్లోని సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఆదివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లోని మద్యం షాపుల్లో పనిచేసే సిబ్బంది ర్యాలీలు నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. త్వరలో మద్యం దుకాణాలు ప్రైవేటుపరం కాబోతున్నాయని, కొత్తగా ఏర్పాటు కానున్న షాపుల్లో తమకు ఉపాధి కల్పించాలని వారు కోరారు. లేనిపక్షంలో తమకు ప్రత్యామ్నాయంగా మరో ఉపాధి కల్పించాలని కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తమను రోడ్డున పడకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఆయా మండలాల సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు, సేల్స్‌మ్యాన్లు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమం

నాయుడుపేట, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



నాయుడుపేట రూరల్ మండలం భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ సభ్యత్వ నమోదు గురించి మండల బాధ్యులు ఎవస్ రవీంద్ర పర్యవేక్షణలో మండల అధ్యక్షుడు పి.రవి అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి బూత్ ఇన్‌ఛార్జ్ బాధ్యతాయుతంగా పనిచేసి కనీసం 200 మంది చేత సభ్యత్వ నమోదు చేయించాలని కోరారు. ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ గురుప్రసాద్‌రాజు, సిహెచ్ రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ వేణయ్య, ప్రధాన కార్యదర్శి టి.సుబ్బారావు, కార్యదర్శి కె.చెంచయ్య, టి.మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు మృతి

గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

అనారోగ్య కారణంగా కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు శనివారం సాయంత్రం మృతి చెందారు. ఈయన సిపిఎం పార్టీలో గూడూరు రూరల్ మాజీ శాఖ కార్యదర్శిగా పని చేశారు. డివైఎఫ్ఐ, ప్రజానాట్యమండలి, జిల్లా స్థాయి నాయకుడిగా పార్టీ కోసం పనిచేసారు. గూడూరు సిపిఎం పార్టీ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కొట్టు శ్రీనివాసులు, అంత్యక్రియలలో పాల్గొని సంతాపాన్ని తెలిపారు. సిపిఎం పార్టీ టౌన్ శాఖా కార్యదర్శి శివకుమార్, వెంకటరామిరెడ్డి, పి. శ్రీనివాసులు, పమంజి మనీ, సురేష్, అడపాల ప్రసాద్, సుబ్బయ్య, ఆర్. శ్రీనివాసులు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్టేడియంలో జిమ్మును ప్రారంభించిన ఎమ్మెల్యే

**గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో ఆదివారం తల్లూరు ప్రసాద్ నాయుడు సహాయంతో జిమ్మును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. మాట్లాడుతూ యువత ప్రతి రోజు వాకింగ్, వ్యాయామంతో జిమ్ చేసుకునేందుకు ఇక్కడ ప్రవేశ పెట్టడం జరిగిందని అందరూ ఉపయోగించుకోవాలని వారు తెలిపారు. ఏగూరు రాజేంద్ర, నాగేంద్ర, విజయ్ కుమార్, రజిని, నాగేశ్వర రావు, సురేంద్ర, వరగలి మాజీ సర్పంచ్ మూగ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంధ విద్యార్థికి స్మార్ట్‌విజన్‌గ్లాస్ వితరణ



**తిరుపతిటౌన్, సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** పాస్‌మనోవికాస్‌లో అంధవిద్యార్థి ఏడుకొండలకు విజన్ ఎయిడ్ ఫౌండేషన్ సొసైటీ స్మార్ట్‌విజన్‌గ్లాస్ వితరణ చేశారు. అంధ విద్యార్థులు చదువుకోవడానికి ఈ విజన్‌గ్లాస్ ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాస్ మనోవికాస్ ప్రిన్సిపాల్ పిఎన్‌వి మురళీకృష్ణ, బాలాజీకిరణ్, సత్యహింత్, వి.బాలాజీ, కిరన్, తేజోవతి, శ్రీదేవిబాలాజీ పాల్గొన్నారు. దాతలను అభినందించారు.

## సిపిఎస్ ఉద్యోగుల బ్లాక్‌డే విజయవంతం

**తిరుపతిటౌన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:**



గత ప్రభుత్వం నిర్వాకంతో ప్రభుత్వ ఉద్యోగులకు అమలుచేయాల్సిన పాత పెన్షన్ విధానంపై ద్వంద్వ వైఖరి అవలంభించిందని ఉద్యోగులు తెలిపారు. దానికి నిరసన తెలిపిన ఉద్యోగులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ ఆదివారం సిపిఎస్ ఉద్యోగులు చేపట్టిన బ్లాక్‌డే విజయవంతమైందని అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఉద్యోగులకు సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు.

## 66ఏళ్ళ వృద్ధునికి లెడ్‌రహిత ఫేస్‌మేకర్

### -ఫోర్టిస్ ఆస్పత్రి వైద్యుల అరుదైన చికిత్స



**తిరుపతిహెల్త్ , సెప్టెంబర్ 01 ప్రభాతవార్త:** ఛాతీవద్ద అమర్చిన ఫేస్‌మేకర్ లోహపు భాగాల కారణంగా తరచుగా ఇన్ఫెక్షన్, బాధపడుతున్న తిరుపతికి చెందిన 66ఏళ్ళ వృద్ధుడికి ఫోర్టిస్ ఆస్పత్రి యాజమాన్యం(బెంగుళూరు)విప్లవాత్మకమైన చికిత్స చేశారు. బెంగుళూరు భన్నేరిఘట్టలోని ఫోర్టిస్ ఆస్పత్రిలో ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజీ వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యబృందం అత్యంత ఉత్తమ సాంకేతికతను వినియోగించి లెడ్ రహిత ఫేస్‌మేకర్ అమర్చారు. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న ఆయనకు ఆరోగ్యంలో గణనీయమైన పురోగతి కనిపించి కోలుకున్నట్లు తెలిపారు. రోగికి అప్పటికే కరోనరీ ఆర్టరీ వ్యాధితో బాధపడతుండటంతో అత్యంత అధునాతన చికిత్సచేయడంలో ఫోర్టిస్ ఆస్పత్రి వైద్యబృందం విజయవంతమైందన్నారు. ఎవరైనా రోగులు ఫోర్టిస్ హెల్త్‌కేర్ తెలుసుకుని తదనుగుణంగా ఆరోగ్యంగా ఉండాలని ఆస్పత్రి యాజమాన్యం కోరింది.

## మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

### కమిషనర్ నారపురెడ్డి మౌర్య



**తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** సెప్టెంబర్ 2వ తేది సోమవారం తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో మీ కోసం - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇకపై ప్రతి సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ తెలిపారు.

## 12 మోటార్ సైకిళ్ళు ఒక ఆటో సీజ్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పోలీసులు ఆదివారం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషను నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన రికార్డుల్లేని 12 మోటార్ సైకిళ్ళు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు అర్బన్ సిఐ డి.గోపి పత్రికల వారికి తెలిపారు. శ్రీకాళహస్తిలో శాంతి భద్రతల పరిరక్షణకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి ఆదేశాలతో ఎస్‌డిపిఓ కె.నరసింహమూర్తి ప్రణాళికలు రచించి తమ సిబ్బందిచే ఆచరింపజేస్తున్నారు.ఈ నేపధ్యంలో పుణ్యక్షేత్రంలో భద్రతతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపడుతున్నారు.ఈ నేపధ్యంలో ఎన్‌టిఆర్ నగర్,శ్రీకాళహస్తి పట్టణంలోని పలు కూడలి ప్రాంతాల్లో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారికి సరైన రికార్డులు చూపకుండా వాహనాలు నడుపుతున్న వారు పట్టుబడ్డారు.వారి నుంచి 12 మోటార్ సైకిళ్ళను ఒక ఆటోను సీజ్ చేసారు.ఈ ఆపరేషన్లో సిఐలు డి.గోపి,వెంకటేశ్వర్లు, రవినాయక్, ఎస్ఐలు సుధాకర్,ఈశ్వర్, విశ్వనాధనాయుడు వరి సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో వైకాపా పూజలు

**శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడు లో గ్రామస్థులు నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం వైకాపా నాయకులు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. శ్రీకాళహస్తి మండలంలోని ప్రతి గ్రామం ఓ ఆధ్యాత్మిక నిలయంగా మారుతుందని నాయకులు వివరించారు. ఎర్రగుడిపాడులో ప్రజలు తమ భాగస్వామ్యంతో నూతంగా ఎల్లమ్మ గ్రామ దేవత ఆలయాన్ని నిర్మించటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి మండల వైకాపా నాయకుడు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ వయ్యాల కృష్ణారెడ్డి, చెర్లోపల్లి సచివాలయ కన్వీనర్ మావిళ్ళపల్లి వెంకటేష్‌నాయుడు, సుధాకర్‌రెడ్డి, రఘు, కేశవరెడ్డి, పసల కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, యాకూబ్ తదితరులు పూజా కార్యక్రమాల్లో హాజరయ్యారు.

## హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలోని నగరివీధిలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 156వ నెల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సంస్థ అధినేత మునీర్‌బాషా ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయవాదులు రాజేశ్వరరావు,గరికపాటి రమేష్‌బాబులు పాల్గొని ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు పంపిణీచేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. 156లు నెలలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు పంపిణీచేయడం సంస్థ అధినేత మునీర్‌బాషాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునానయుడు పాలనలో రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉండారని, న్ని ముందస్తు ఎన్టీఆర్ భరోసా ఫించను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి ఇందులో ప్రత్యేక ప్రతిభావంతులకు రూ.6వేలు ఫించను అందజేసిన ఎన్డీఏ ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు కోళ్ళూరుహరనాధ్‌నాయుడు,డిల్లీకుమార్, బాబాఫరీద్ మరియు హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ విద్యార్థుల బాధ్యత

**.తొట్టంబేడు, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



యంగ్ ఎంప్లాయిస్‌సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న 6 నుంచి 10వ తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు పాఠశాల స్థాయిలో పర్యావరణ పరిరక్షణ అన్న అంశంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో పాఠశాల స్థాయిలో ముగ్గురు జూనియర్స్ మరియు ముగ్గురు సీనియర్లను ఎంపికచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఎస్పీ నరసింహమూర్తి మరియు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముత్తుస్వామి సురేష్‌బాబులు హజరయ్యారు. డిఎస్పీ నరసింహమూర్తి మరియు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముత్తుస్వామి సురేష్‌బాబులు హాజరయ్యారు. డిఎస్పీ మాట్లాడుతూ యంగ్ ఎంప్లాయిస్ సర్వీస్ చేస్తున్న సేవలను కొనియాడారు. పర్యారణాన్ని పరిరక్షించాలంటే నేడు మొక్కలను పెంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. సంస్థ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు పలు చేస్తున్నామని సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎన్నడూ ముందుంటామన్నారు. అనంతరం విజేతలకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సోషల్ సర్వీస్ సభ్యులు నారాయణ, షరీఫ్, శ్రీనివాసులు, అంజయ్య, చంద్రకాంత్, రాజశేఖర్, రమణ, సాయి, ప్రదీప్‌కుమార్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి అభివృద్ధి ప్రధాత..సిబియన్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



తెలుగుజాతి ఆత్మగౌరవ పరిరక్షణకు నడుం బిగించి, తెలుగుదేశంపార్టీని స్థాపించిన 9నెలల కాలంలో అధికారంలోకి వచ్చిన స్వర్గీయ ఎన్టీఆర్ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న సిఎం నారాచంద్రబాబు నాయుడు తెలుగుజాతి అభివృద్ధి ప్రధాత అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్‌రావు, మరియు సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మరియు 13వ యూనిట్ ఇన్‌ఛార్జి నెమళ్ళూరు సుబ్రమణ్యం(బుజ్జి)కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేసి నేటిని 29 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 30 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకుని నెమళ్ళూరు బుజ్జి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ నగర్ కూడలిలో సిబియన్ చిత్రపటాన్ని ఉంచి ఆయన రాష్ట్ర అభివృద్ధికి చేసిన సేవలు వివరించారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పూలశేఖర్, చెంబేటి బాలయ్య, సులేమాన్, శివ, తేజ, కోటయ్య, రమేష్, సుబ్రమణ్యం, ప్రసాద్, గోపి, లోకేష్, సుధాకర్, ముని, సురేష్, దాము తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఎంఈవో భాస్కర్ మృతి



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణానికి చెందిన విశ్రాంత ఎంఈవో ఎన్.హెచ్.భాస్కర్(75) అనారోగ్యంతో ఆదివారం వేకువ జామున మృతి చెందాడు. ఆయన పుత్తూరు ప్రధాన పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా సేవలం దించారు. ఆయన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి నుంచి ఉత్తమ జాతీయ అవార్డును అందుకున్నారు. అనంతరం ఎంఈవోగా పని చేశారు. పలువురు ఆయన మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## విఐ నెట్‌వర్క్ సామర్థ్యం రెట్టింపు స్థాయికి పెంపు

**తిరుపతి విద్యా సెప్టెంబర్ 1,ప్రభాతవార్త:** దిగ్గజ టెలికాం కంపెనీ అయిన విఐ ఆంధ్రప్రదేశ్ లోని తమ నెట్‌వర్క్ సామార్థ్యాన్ని అప్‌గ్రేడ్ చేసినట్లు వెల్లడించింది.రాష్ట్రంలోని 1,000 పై చిలుకు సైట్లలో ఎల్ టి ఐ 2500 ఎం హెచ్ జడ్ బ్యాండ్ లో స్పెక్ట్రంను 10 ఎం హెచ్ జడ్ నుంచి 20 ఎం హెచ్ జడ్ కి విఐ అప్‌గ్రేడ్ చేసింది.తద్వారా ఈ లేయర్ లో నెట్‌వర్క్ సామార్థ్యాన్ని రెట్టింపునకు పుంచుకుంది.తిరుపతి,చిత్తూరు, నెల్లూరు, చిలకలూరిపేట, విజయనగరం,మదనపల్లె,మంగళగిరి,నంద్యాల,శ్రీకాకుళంగుంటూరు,హిందుపూర్,కడప,విశాఖపట్నం,విజయవాడ,నరసారావు పేట,ప్రొద్దటూరు,తాడిపత్రి తదితర నగరాలు ఈ జాబితాలో ఉన్నాయి.ఈ అప్‌గ్రేడ్ తో వి ఐ గిగానెట్ నెట్‌వర్క్ పై కస్టమర్లు మరింత వేగవంతమైన డేటా స్పీడ్ ను అనుభూతి చెందగలరు అని ఆనంద్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో తమ కస్టమర్లు ముందుకెళ్లేలా వారి కోసం విఐ సరికొత్త ఆఫర్లు ప్లాన్లను కూడా ప్రవేశపెట్టింది.

## ఉచిత మెగా వైద్య శిబిరం

**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో వెంకటరమణ హార్ట్, మెటర్నిటీ హాస్పిటల్ నందు 18వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిభిరం నిర్వహించారు. ఈ వైద్య శిభిరంలో ఉచితంగా ఈసిజి, ఆర్‌బిఎస్, ఎకో, యుఎస్‌జి, గర్భిణీ స్త్రీలకు ఉచితంగా స్కానింగ్ పరీక్షలు చేశారు. ఈ వైద్య శిభిరంలో 450 మందికి ఉచితంగా పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారని హాస్పిటల్ డైరెక్టర్లు, సీనియర్ గుండె వైద్య నిపుణులు డాక్టర్ సి. వెంకటరమణ, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ ఆర్. నిరుపమ తెలిపారు. ఈ వైద్య శిభిరానికి విశేష స్పందన వచ్చిందని తెలిపారు.

## అలుపెరగని పోరాట యోధుడు సిఎం చంద్రబాబు

### టిడిపి ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ



**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** అలుపెరగని పోరాట యోధుడు సిఎం చంద్రబాబు నాయుడు అని తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మన్నూరు సుగుణమ్మ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో ఆమె మాట్లాడుతూ 28 ఏళ్ళకు ఎమ్మెల్యే, 30 ఏళ్ళకు మంత్రి, 45 ఏళ్ళకు ముఖ్యమంత్రి, 74 ఏళ్ళ వయస్సులో 4వ సారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రయాణం. మహిళా సాధికారత కోసం డ్వాక్రా సంఘాలు, చేయూత, పసుపు కుంకుమ, ఫీ ఆటోలు, తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, బడికి వస్తా సైకిళ్ళు, చంద్రన్న పెళ్లి కానుక, దుల్హన్ పథకం, దీపం పథకం, వితంతు పెన్షన్లు, చంద్రన్న సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుక, రైతుల కోసం రైతు రుణమాఫీ, ఎన్టీఆర్ జలసిరి, నీరు చెట్టు, పొలం పిలుస్తోంది, అన్నదాత సుఖీభవ, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో యువత కోసం 38 వేలకు పైగా ఐటి ఉద్యోగాలు, ఐటీ హబ్‌గా విశాఖ, అనంతపురం జిల్లా కియా, చిత్తూరులో ఎలక్ట్రానిక్ పరిశ్రమలు, కర్నూలులో సౌర విద్యుత్ పరిశ్రమలు, విశాఖలో ఫార్మసోటికల్ పరిశ్రమలు, అంబేద్కర్ విదేశీ విద్యా నిధి, బీసీ స్టడీ సర్కిల్, నెలకు 2000 నిరుద్యోగ భృతి, ఫీజు రీయంబర్స్మెంట్, మరెన్నో పథకాలు తీసుకొచ్చారన్నారు.రాష్ట్ర నాయకులు సురా సుధాకర్ రెడ్డి బుల్లెట్ రమణ, బిజి కృష్ణ యాదవ్, మన్యం శ్రీనివాసులు, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆముదాల తులసి, మునిశేఖర్‌రాయల్, ఆర్పి శ్రీనివాసులు, సుబ్రమణ్యం, మునిరామయ్య, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రెండు నెలలకోసారి రక్త పరీక్షలు తప్పనిసరి

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త** ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్స్, తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని తిరుపతిలోని ప్రముఖ నారాయణాద్రి హాస్పిటల్ వారిచే 10 మంది వివిధ విభాగాల్లో నిష్ణాతులైన ప్రముఖ డాక్టర్లు, వారి సిబ్బందితో సౌజన్యంతో 1000 మంది వాకర్స్‌కు రక్తపరీక్షలు, ఉచిత మందుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్య అతిధిగా విచ్చేసి వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్కులోని సమస్యల గురించి ఎమ్మెల్యేకి తెలిపారు. ఆయన స్పందిస్తూ తప్పకుండా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కొత్తవి, అత్యధికమైన పరికరాలను అమరుస్తామని, వాకర్స్ నడుచుటకు అనువైనటువంటి సౌకర్యాన్ని కల్పిస్తానని కూడా తెలియజేశారు. తిరుపతిలో అన్ని పార్కులలో ఇలాంటి ఉచిత వైద్య శిభిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ముఖ్య అతిధులు వాకర్స్ అసోసియేషన్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట రెడ్డికి కార్యదర్శి గోపి అధ్యక్షతన వారికి పుష్పగుచ్ఛంతో, దుశ్శాలువతో వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి, కార్యదర్శి గోపినాథ్, కోశాధికారి వి. జగన్నాథం, బెల్లింకొండ సురేష్, ఆస్టర్ నారాయణాద్రి, ప్రతినిధులు డా. శ్రీధర్ ముని, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

**పాకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త**



పాకాల మండల పరిధిలోని అన్ని వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి అని పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మద్దయ్య ఆచారి స్పష్టం చేశారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా గానీ మీసేవ ద్వారా గాని దరఖాస్తు చేసుకుని పోలీసు వారి అనుమతి పొందాలని తెలియజేశారు. వినాయక మండపాలకు అనుమతి పొందిన వారు మండపాల వద్ద ఎటువంటి ప్రమాదములు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుని అనుమతి లేని వినాయక మండపాల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో బిక్షగాడు మృతి

**నింద్ర, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :**



ఆదివారం ఉదయం సుమారు 5 నుంచి 6 గంటల మధ్యలో నింద్ర మండలం కొప్పేడు దళితవాడ సమీపంలో జాతీయ రహదారిపై 55 వయస్సు లోపు వున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతను మృతి చెందినాడు. మృతి చెందిన బిక్షగాడు ఆకు పచ్చ డ్రాయర్, పసుపు పచ్చ రంగు కలిగిన షర్టు, దానిపై తెలుపు షర్టు ధరించి వున్నట్లు తెలుస్తోంది.మృతి చెందిన బిక్షగాడుని నగరి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టు నిమిత్తం తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎయస్ఐ ఏయుమలైరెడ్డి తెలిపారు.

## వెంకన్న సేవలో ఆదిమూలం



**తిరుమల, సెప్టెంబర్ 01ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం ఉదయం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు.

## మంత్రి సంధ్యారాణిని కలసిన

### జనసేనాని యుగంధర్

**తిరుమల, సెప్టెంబర్ 1ప్రభాతవార్తప్రతినిధి:**



శ్రీవారి దర్శనార్థం తిరుమలలో ఉన్న రాష్ట్రమంత్రి గుమ్మడి సంధ్యారాణిని జిడి నెల్లూరు జనసేనాని ఇన్‌ఛార్జి యుగంధర్‌పొన్నా కలిశారు. ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన ఆయన మర్యాదపూర్వకంగా మంత్రిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## శివయ్యను దర్శించుకున్న ఆర్‌పి గ్రూప్ చైర్మెన్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆర్‌పి గ్రూప్ చైర్మెన్ పద్మశ్రీ రవి పిళ్ళై పూజలు చేయించుకున్నారు. ఆదివారం ఆయన రాగా ఆయనకు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్,రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు.ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ వేదపండితులతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర ఓబిసి మోర్చా కు చెందిన ధర్మరాజులు, సభ్యులు ఎస్వి రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి గోపాల్, కూనాటి నాగరాజు,అమర్‌నాధ్, పుణ్యం డిల్లికుమార్, కన్నా వెంకటేశ్వర్లు,సూరనారాయణ రాజు చందు రాయల్, హరీష్, చైతన్య,రవి రాయల్, గిరిధర్‌సాయి, కుమార్, శ్రీధర్,ఢిల్లి తదితరులు ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## పురవీధుల్లో గెరిగె ఊరేగింపు

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీ ధర్మ రాజులస్వామి ఆలయ ప్రాంగణంలో గంగజాతర సందర్భంగా గెరిగెను వివిధ పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాలు నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపు కార్యక్రమం మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గంగ జాతరకమిటీ వారు తెలిపారు. ఈ ఊరేగింపు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంటుందన్నారు. అలాగే 3వ తేదీ సాయంత్రం మంచినీళ్ళగుంట వద్ద నుంచి చాటు బండి ఊరేగింపు కార్యక్రమం, అనంతరం అర్ధరాత్రి బజారువీధిలోని గంగమ్మ మండపం వద్ద గంగమ్మను ప్రతిష్ఠాపన కార్యక్రమంలో గంగ జాతర కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 4వ తేదీ రాత్రి పాట కచ్చేరి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. భక్తులు మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** పుత్తూరు మండల పరిధిలోని గోపాలకృష్ణాపురం ఎస్టీ కాలనీలో తిరుపతి పట్టణానికి చెందిన శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 45 మంది రోగులకు బీపీ, షుగర్ వ్యాధులకు చికిత్సలు చేశారు. డాక్టర్లు, వేద తేజ, డా. విజయలక్ష్మి, తెలుగుదేశం పార్టీ పుత్తూరు రూరల్ టీడీపీ అధ్యక్షుడు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ...లోకేశ్వరి

**రేణిగుంట, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



దైవం మానుష రూపేణా అంటే దేవుడు మానవరూపంలో ఉంటాడని మనిషికి సేవ చేస్తే దేవుడికి చేసట్లేనని లోకేశ్వరి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ లోకేశ్వరి అన్నారు. రేణిగుంట మండలంలోని తారక రామా నగర్‌లో లోకేశ్వరి చారిటబుల్ ట్రస్టు కార్యాలయాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్వరి మాట్లాడుతూ ప్రజాసేవచేయడానికి ఎలాంటి రాజకీయ పదవులు అవసరం లేదన్నారు. సేవ చేయాలన్న దృక్పథం ముఖ్యమన్నారు. ఇప్పటి వరకు తన సొంత డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలను ఉదాహరించారు. గత ఐదేళ్లుగా మరణించిన వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువులు సమకూర్చడం, పేద విద్యార్థుల చదువుల కోసం ఆర్థిక సహాయం చేయడం తన కర్తవ్యంగా భావించి చేశామన్నారు. అదే సంకల్పంతో ప్రజాసేవ కోసం చారిటబుల్ ట్రస్టు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోటి, సీపీఎం పార్టీనాయకులు రాజశేఖర్, సంఘమిత్ర రేఖారెడ్డి, కరకంబాడి పంచాయతీ మెంబరు తహసీన, తిరుపతి తెలుగుదేశం పార్టీ మహిళా కార్యకర్తలు జుబేదా, ఉష, సునీత, శ్రీవల్లి, అనిత, భారతి, సుధా తదితరులు పాల్గొన్నారు.

## దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

**పాకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త**



స్థానిక మండల కేంద్రం పాకాల నందు ఆదివారం జరిగిన కార్యక్రమాలలో ఎన్‌డిఎ కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని, తదుపరి కాణిపాకం, బెంగళూరు బస్సు సర్వీసులను ప్రారంభించి స్వయంగా ఆర్టీసీ బస్సుని నడిపి నాయకులు కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపిన ఎమ్మెల్యే నాని, గత కొన్ని సంవత్సరాలుగా బెంగళూరుకి కాణిపాకంకి వెళ్లాలంటే హైవే పైకి వచ్చి బస్సు ఎక్కాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యను కొద్ది రోజులకు ముందు పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి తిరుపతి బెంగళూరు వయా పాకాల అలాగే తిరుపతి, కాణిపాకం వయా పాకాల బస్సులను ఆయన పాకాల ఆర్టీసి బస్టాండ్‌లో ప్రారంభించారు. దీనితో పాకాల మండల వాసులకు అలాగే గుంతకల్, ధర్మవరం, మదనపల్లి వైపు నుంచి ట్రైన్లో వచ్చేభక్తులకి పాకాల నుంచి కాణిపాక పుణ్యక్షేత్రంకి వెళ్లే సమస్య తీరిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే తిరుపతి నుంచి తిరువన్నామలై తిరువన్నామలై వెళ్లేతట్టు చూడాలని, భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున తిరువన్నామలైకి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## సాకం కృష్ణమూర్తికి గౌరవ డాక్టరేట్ ప్రదానం

**పాకాల, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త**



పాకాల మండలం వరదప్ప నాయుడు పేట నివాసి, ప్రముఖ సామాజిక సేవకులు సాకం కృష్ణమూర్తికి ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారి ఆధ్వర్యంలో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరర్ అకాడమీ వారు కర్ణాటక, హోసూర్‌లో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో గత 25 సంవత్సరములుగా రియల్స్ స్వచ్ఛంద సంస్థ తరపున తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలలో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను సాకం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి, రియల్స్, స్వచ్ఛంద సంస్థ, తిరుపతి గౌరవ డాక్టరేట్ అందుకోవడం జరిగింది.

## ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే

### అడ్రస్ గల్లంతు కావడం ఖాయం - క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి

**పిచ్చాటూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:**



సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై అసత్య ఆరోపణలు చేస్తే వారి అడ్రస్ గల్లంతేనని మాజీ ఏంఎపీ చైర్మన్ ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలోపార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండూరు బాలరాజు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ అతన్ని పార్టీ నుంచి బహిష్కరించాల్సిందిగా అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి దశాబ్దాలు తరబడి ఎలాంటి పదవులు లేకుండా నిస్వార్థంగా పని చేస్తున్న పలువురు నాయకులు ఉన్నప్పటికి ఎన్నికల ముందు ఎక్కడో తమిళనాడులోని రెడిల్స్‌లో ఉన్న నువ్వు స్వయం ప్రకటిత రాష్ట్ర పదవిని ఉందంటూ డబ్బులు ఉందన్న అహంకారంతో అన్ని తానేనని వివరించారు. కాలం సమాధానం చెబుతుంది అనతి కాలంలోనే నీవు ఆశించిన నామినేటెడ్ పదవి రాదన్న క్రోధతో ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నావన్నారు. కూటమి నేతలతో సఖ్యతగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యేపై రాద్ధాంతం చేస్తే చూస్తూ ఊరుకోమని తక్షణం ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వాసురెడ్డి, భక్తారెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో ఆవు మృతి



**విజయపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** అధికారుల నిర్లక్ష్యంతో ఆవు మృతి చెందిందని మండలంలోని జగన్నాథపురంలో రైతు వెంకటేశులు ఆరోపించారు. గర్భిణీ ఆవు వారం రోజుల క్రితం రూ.60 వేలకు కొనుగోలు చేశానని, మేత మేయడం లేదని సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్‌కు ఫిర్యా దు చేశానని, ఆయన ఆవును పరిశీలించినా ఫలితం లేకపోవడంతో సమాచారం మండల పశు వైద్యాధికారికి ఫిర్యాదు చేస్తే ఆయన కనీసం పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించకపోవడం వలన ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాడి పశువులను నమ్ముకుని జీవనం సాగించేవాడని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## మాజీ వైస్ ఎంపీపీ మునిరాజు మృతి



**విజయపురం, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన విజయపురంలో మాజీ వైస్ ఎంపీపీ మునిరాజు(65) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన టీడీపీలో క్రియాశీలక వ్యక్తిగా ఎంపీటీసీగాపని చేశారు. ఆయన మృతి పట్ల జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, రవిరాజుసంతాపం వ్యక్తం చేశారు.

## జానపద కళలను కాపాడుకోవాలి

**.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త**



జానపద కళలను కాపాడుకోవాలని కోరుతూ అన్ని కళలకు, జానపద కళలు మూలం అని ఇలాంటి కళలను కాపాడుకోవాలని కోరుతూ ఆదివారం ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జానపద కళలను భావితరాలకు అందించాలని ఉత్సవాల్లో కళాకారుల్లో కొత్త ఊపిరి పోస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ పేరొందిన కళాకారును ఆదుకోవాలని పి.హరినాధరెడ్డి అన్నారు. తిరుపతి జిల్లా స్థాయి ప్రజాచైతన్య జానపద కళా ఉత్సవాలుకు ఊపిరిపోయాలన్నారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నంపెంచలయ్య, జిల్లా కార్యదర్శి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సినీనటుడు కృష్ణచైతన్య,ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నాగభూషణం, కత్తిరవి, జనమాల గురవయ్య, శివకుమార్, గోపి, శ్రీనివాసులు ఎఐఎస్ఎఫ్ నాయకులు మునిచందు, మంజుల,నాగభూషణమ్మ, చారులత, రత్నమ్మ, భజన గురువులు, కళాకారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రేషన్‌బియ్యం అక్రమ రవాణా ...

## నియంత్రించడంలో విఫలమౌతున్న పోలీసులు

దొరవారిసత్రం సెప్టంబరు 1 ప్రభాతవార్త;
నెల్లూరు–తమిళనాడు–తిరుపతికి కేంద్ర బిందువైన దొరవారిసత్రంలో ఏదో ఒక ప్రాంతంలో రేషన్‌బియ్యం, ఇసుక, గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నా నియంత్రించడంలో పోలీసులు విఫలమౌతున్నరన్నా విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌతున్నాయి. సూళ్ళూరుపేటకు చెందిన రేషన్‌బియ్యం ముఠా నియోజకవర్గంలో సేకరించిన రేషన్‌బియ్యంను దొరవారిసత్రం మండలంలోని నెలబల్లి, కలగుంట ప్రాంతాల్లో నిల్వచేసి అక్కడ నుండిరాత్రిసమయంలో లారీ ద్వారా నెల్లూరుకు తరలిస్తున్నారు. అదేవిధంగా వెదురుపట్టు కాళంగినది నుండి ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా రాత్రిసమయంలో ట్రాక్టర్లు ద్వారా ఇసుకను అటవీప్రాంతానికి తరలించి అక్కడ నుండి టిప్పర్లుతో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ మాఫియాకు పాల్పడుతున్నారు. కొంతమంది అక్రమార్కులు ఇతరప్రాంతాల్లో సేకరించిన గంజాయిని నియోజకవర్గంలో దళారులను ఏర్పాటుచేసుకొని వారిద్వారా యువతకు అందిస్తూ


ఫైల్‌పోటో

మత్తుకు బానిసలు చేస్తూ వారిజీవితాలను చిన్నభిన్నం చేస్తున్నారు. ముఖ్యంగా నాయుడుపేట–దొరవారిసత్రం మండలాల్లో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఇటీవల మార్చినెలలో నాయుడుపేట బీడికాలని సమీపంలో స్వర్ణముఖినది కరకటలపై యువకులు గంజాయితాగి మత్తులో ఒకరిపై మరొకరు దాడిచేసి బ్లేడ్‌తో మెడపై తీవ్రంగా గాయపరిచిన సంఘటన తెలిసిందే. అంతేకాకుండా దొరవారిసత్రం మండలంలోని నెల్లబల్లి ధాన్యలక్ష్మి రైస్‌మిల్లులో పనిచేస్తున్న యువకుడు గంజాయి సేవించి మత్తులో ఎనిమిదేళ్ళ పాపపై అత్యాచారంచేసి ఆపై హత్యచేసిన విషయం విదితమే. గంజాయి మాఫియా గ్రామాలకు పాకడంతో యువత మత్తుకు అలవాటుపడుతూ ఘర్షణలకు దిగుతున్నారు. ఇంతజరుగుతున్న పోలీసుల అటువైపు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాఉన్నతాదికారులు స్పందించి గంజాయి మాఫియాను అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

# సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ వద్దు .. ఓపిఎస్ ముద్దు

గూడూరు, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త




గూడూరు ఆర్డీవో కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో నూతన పెన్షన్ విధానానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె బాబు మాట్లాడుతూ అన్యాయమైన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి అందరికీ ఆమోదయోగ్యమైన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు ఎం. జయపాల్ రెడ్డి ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగికి భద్రత లేకపోవడం అన్యాయమన్నారు. గూడూరు మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్య పెన్షన్ కంటే తక్కువ వచ్చే నూతన పెన్షన్ విధానానికి స్వస్తి పలకాలన్నారు. ప్రధాన కార్యదర్శి బి. శివకుమార్ మాట్లాడుతూ వరల్డ్ బ్యాంకు షరతులకు తలొగ్గి 35 ఏళ్ళు ప్రజలకు సేవ చేసిన ప్రభుత్వ ఉద్యోగికి ఇచ్చే పెన్షన్‌ను షేర్ మార్కెట్‌తో అనుసంధానించడం చాలా అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో సైదాపురం మండ్వల్ అధ్యక్షులు చంద్రశేఖర్, శివప్రసాద్, కోటేశ్వర రావు, మురళి, లోకనాథం, చంద్రశేఖర్, బెంజమిన్ పాల్గొన్నారు.

# కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం



కాణిపాకం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకసా ్వమివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలకు ఆహ్వానిస్తూ దేవస్థానం అధికారులు ఆదివారం పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌కు ఆహ్వానపత్రికలను అందజేశారు. దేవస్థానంలో సెప్టెంబర్ 7 నుండి 27 వరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు 21 రోజుల పాటు జరుగనున్నాయి. ఈమేరకు చిత్తూరు లక్ష్మీనగర్ కాలనీలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ఆలయ ఈఓ గురుప్రసాద్ అర్చకులు, స్థానిక టీడీపీ నాయకులతో కలసి బ్రహ్మోత్స వాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రాలను అందజేశారు. అనంతరం దేవస్థానం తరపున అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావులతో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.

### బ్రహ్మోత్సవాలకు పలువురు ప్రముఖులకు ఆహ్వానం

ఈనెల 7 నుండి జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్స వాలకు పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తూ ఆశ్వాన పత్రికలను అందజేశారు. ఈమేరకు స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, ఆలయ ఈఓ గురుప్రసాద్‌లు స్థానిక టీడీపీ నాయకులతో కలసి దిగువమాఘంలోని స్వగృహంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు దంపతులు, అమర ఆస్పత్రి అధినేత గౌరినేని రమాదేవి దంపతులను కలసి బ్రహ్మోత ్స వ ఆహ్వానపత్రికలను అందజేశారు. అలాగే వారికి దేవస్థానం తరపున అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, టీడీపీ నాయకులు దిలీప్, మేమాద్రినాయుడు, పట్నం గోపీయాదవ్, ప్రవీణ్‌నాయుడు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడికి మూషిక వాహనం వితరణ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:
పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో వెలసిన శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి పుత్తూరు పట్టణం సెంగుంధర వీధికి చెందిన ఎబ్బూరు శ్రీనివాసులు, భానుమతి దంపతులు సుమారు రూ.70 వేలు విలువ చేసే మూషిక వాహనాన్ని వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఈ మూషిక వాహనాన్ని వినాయక చవితి ఉత్స వాలకు ఊరేగింపుకు ఈ వాహనం ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఆలయంలో పూజలు చేసి మూషిక వాహనాన్ని పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగించి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఎబ్బూరు శ్రీనివాసులు, భానుమతి దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



# సైకో స్వైరవిహారం.. పలువురికి గాయాలు


గాయపడ్డ తండ్రి, కుమార్తెలు

చౌడేపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త
స్థానిక బస్టాండులో ఓ సైకో స్థైర్యవిహారం చేసాడు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా అడ్డు వచ్చిన వారినెల్లా బ్లేడ్లతో గాయపరచాడు. బాధితుల కథనం మేరకు...రామసముద్రం మండలం కొండూరుకు చెందిన ఆదినారాయణ తన కుమార్తె చిత్రలు ఆర్టీసీ బస్సులో సోమల మండలం ఇరికిపెంట డ్యామ్‌కు బయలుదేరారు. పుంగనూరులో ఆర్టీసీ బస్సు ఎక్కి వారు చౌడేపల్లికి చేరుకొన్నారు. చౌడేపల్లిలో సూరయ్యగారిపల్లికి వెళ్ళేందుకు వేచివున్న రాజేష్ బస్సు రాగానే లోనికి వెళ్ళాడు. అక్కడ చిత్రతో అసభ్యంగా ప్రవర్తించాడు. పక్కనే వున్న ఆమె తండ్రి ఆదినారాయణ అతన్ని అడ్డుకొన్నాడు. దీంతో చెలరేగి పోయిన రాజేష్ అప్పటికే అతని వద్దగల బ్లేడ్లతో ఆదినారాయణ, చిత్రలపై దాడి చేసాడు. వెంటనే అప్రమత్తమైన కొందరు అతన్ని పట్టుకొనే ప్రయత్నం చేసారు. ఇందులో భాగంగా ఛాంద్‌భాషా, మహేష్‌లను సైతం బ్లేడుతో గాయపరచాడు. కాగా పాత పోస్టాఫీసు వద్దకు వెళ్ళగానే స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈమేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

## ఉత్సవాలకు తమిళనాడుకు చెందిన దాత రూ.84 వేలు విరాళం




నగరి, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:
మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో టీటీడీ ఆధీనంలోని అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశేశ్వర ఆలయంలో పవిత్రోత్స వాలను ఆదవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి పుష్పాలతో అలంకరించారు. ఉత్స వ మండపం వద్ద అన్నపూర్ణ సమేత కాశీ విశేశ్వర స్వాముల ఉత్స వ విగ్రహాలకు కలశాలతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలతోను, పుష్పాలతో అలంకరించారు. హోమ పూజలు నిర్వహించి పుణ్యవచనం, వేదపారాయణవణం చేసి పవిత్రాలకు ప్రత్యేక పూజలు చేసి ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం పవిత్రాలను ఉత్స వ విగ్రహాలకు అలంకరించారు. పవిత్రోత్స వాలకు తమిళనాడు చెన్నై నుంగంబాకంకు చెందిన ఎస్‌పీఆర్ అండ్ కంపెనీ ఆదిత్య గ్రూప్ ఆడిటర్ రూ.84 వేలు విరాళంగా అందించారు. విరాలపు చెక్కును డిప్యూటీ ఈవో నాగరత్నమ్మకు ఆలయ అర్చకులు కుప్పయ్యశెట్టి సమక్షంలో అందించారు. పవిత్రోత్స వాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# సిఎం చంద్రబాబు పాలనలో ప్రజలకు మంచిరోజులు

## - ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్




కుప్పం, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్ర ప్రజలకు మరలా మంచి రోజులు వచ్చాయని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం బెంగళూరు నగరం కెఆర్ పురంలో బెంగళూరు టిడిఎఫ్ ఫోరం 11వ ఆవిర్భావ దినోత్స వ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, మంత్రి సవితమ్మ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, ఎమ్మెల్యే సురేంద్రబాబు, చెన్నై టిడిపి ఫోరం చంద్ర, రావి మోహన్, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు కృష్ణార్జునుల్లా ముందుకు సాగుతున్నారన్నారు. వారికి ఎట్టి పరిస్థితుల్లో భంగం కలిగించరాదని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్న యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అనేక పరిశ్రమలు తీసుకువస్తామని పేర్కొన్నారు. రాష్ట్రానికి చంద్రబాబునాయుడు సిఎం కాగానే పారిశ్రామిక వేత్తలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారని అది కేవలం సిఎం చంద్రబాబు బ్రాండ్ అన్నారు. తెలుగుదేశం పార్టీని, సిఎం చంద్రబాబునాయుడును భారీ మెజార్టీతో గెలిపించేందుకు యువత ఎంతగానో కష్టపడ్డారన్నారు. బెంగళూరు టిడిపి ఫోరం సభ్యులు తెదేపా అధినేతపై ఎంతో అభిమానంతో ఎన్నికల సమయంలో ముందుకు వచ్చి రాష్ట్రానికి విజనరీ నేతను సిఎం చేయాలని కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో కుప్పంలో యువత కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు అరాచకాలు ఎదుర్కొన్నారన్నారు. ఇప్పుడు కూడా వారు చేసే చౌకబారు

# సత్యబండపై మోపిన జనపాదం వారికదే స్వర్గధామం

## -కన్నుల పండుగలా తిరుణాళ్ళు- అలరించిన ఉట్లోత్సవం

చౌడేపల్లి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



మండంలోని వెంగళపల్లి పంచాయతీ రాజనాలబండపై ఆదివారం వీరాంజనేయుని తిరుణాళ్ళు కన్నుల పండుగలా జరిగాయి. శ్రీఆంజనేయం ప్రసన్న ఆంజనేయం నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. ఆలయంలో ఉదయాన్నే స్వామి వారికి ప్రత్యేకాభిషేకం, విశేషాలంకరణ నిర ్వహించారు. బండ ఈనిందా అన్నట్లుగా జనం బండకు చేరుకొన్నారు. ఏడు గ్రామాల నుంచి దేవరెద్దులను తీసుకొచ్చి ఓ చోటవుంచి వాటికి విశేష పూ జలు నిర్వహించారు. దేవరెద్దుల ఊరేగింపులో కోలాటలు, పిల్లనగ్రోవి, దప్పులు భక్తులను అలరించాయి. చుట్టు పక్కల యువకులచే నిర్వహించబడ్డ పోకమాను బరగడం, ఉట్లోత్స వం చూపరులకు కనువిందు చేసింది. తిరుణాళ్ళను బోయకొండ గంగమ్మ సూక్ష్మరూపంలో వచ్చి చూడటాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపించారు. తొలిసారిగా టిటిడి ఆధ్వర్యలో తిరుణాళ్ళు జరిగాయి. దీంతో కార్యక్రమాలను ప్రతిష్టాత్మ కంగా తీసుకొన్నారు. రాజనాలబండ యువత భక్తులకు ఉచిత అన్నదానం, వసతులు సమకూర్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసన్న ఆంజనేయస్వామికి ముడుపులు చెల్లించారు.

# అందరూ కలసి భక్తితో వినాయకచవితి జరుపుకుందాం

## -కరప్రతాల ఆవిష్కరణలో కమిటీ



తిరుపతిటౌన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
ఆధ్యాత్మికనగరం తిరుపతిలో గత 23 సంవత్స రాలుగా జరుపుకునే విధంగానే ఈనెల 7వతేదీ వినాయక చవితిని విజయవంతంగా నిర్వహించేలా చూద్దామని వరసిద్ధివినాయక మహోత్స వ కమిటీ తెలిపింది. వినాయకచవితిని మట్టి విగ్రహాలను పూజిద్దామని, సకాలంలో ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేద్దామని కమిటీలకు సూచనలు చేసే కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. టిడిపి ఇన్‌ఛార్జి సుగుణమ్మ, వరసిద్దివినాయక కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపీనాథరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, నవీన్‌కుమార్‌రెడ్డి, ఊకా విజయకుమార్, భాస్కర్‌నాయుడు, వంశీరెడ్డి, బాబు, రుద్రకోటి సదాశివం, ఆనంద్, హేమంతకుమార్‌యాదవ్, బాలాజీ, వేణుగోపాల్ నాయుడు, కరాటే శ్రీనివాస్, మన్నెం హరి తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజే...విషాద మరణం


మృతిచెందిన వేణుప్రసాద్

పుంగనూరు, సెప్టెంబరు 1 ప్రభాతవార్త :
తన పుట్టినరోజు నాడే ఒక యువకుడు దుర్మరణం పాలైన విషాదసంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని నానా సాహెబ్ పేటకు చెందిన వేణుప్రసాద్ అనే యువకుడు శనివారం నాడు ఉదయమంతా ఇంటిల్లిపాదితో కలసి తన పుట్టినరోజు సంబరం చేసుకున్నాడు. సాయంత్రం స్నేహితులతో కలసివెళ్ళిన వేణు ప్రసాద్ శనివారం రాత్రి గోకుల్ సర్కిల్ వద్ద ప్రమాదానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్ళడంతో వేణుప్రసాద్ మృతిచెందాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకుని భోరున విలపించారు. పుట్టినరోజే ఇలా తన కుమారుడు మృతిచెందడంతో కుటుంబీకుల ఆవేదన వర్ణణాతీమైంది. మృతుడు వేణుప్రసాద్ తండ్రి నారాయణ పెయింటర్‌గా జీవిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని కనుగోనేందుకు పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు.

# ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి

తిరుపతిటౌన్, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:
అమరగాయకుడు ,తెలుగువారి హృదయాల్లో నిలచిన మధురగాయకుడు ఘంటసాల విగ్రహానికి ఆదివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు పాలాభిషేకం చేశారు. ఘంటసాల తెలుగుప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడని కొనియాడుతూ నగరంలోని భవానీ నగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పా పద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, ఆదిస్వామి, చెంగల్‌రెడ్డి తదితరులు పాలాభిషేకం చేసి, పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చిత్రపు హనుమంతరావును సన్మానించారు.



# శివయ్య సేవలో మంత్రి పూజలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాష్ట్ర మైక్రో, చిన్న, మధ్య ఎంటర్‌ప్రైజస్, గ్రామీణ పేదరిక నిర్మూలన, ఎన్‌ఆర్ఐ సాధికారికత మరియు సంబంధాల శాఖ మంత్రి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తన సహచరులతో కలసి శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్నారు. మంత్రి రాక సందర్భంగా ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలో ప్రాధాన్యతను శ్రీకాళహస్తి మండల తెలుగుదేశం అధ్యక్షుడు కామేష్ యాదవ్ వివరించారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం చేసుకున్న మంత్రికి మృత్యుంజయ ఆలయం వద్ద వవేదపండితులచే ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్, పిఆర్ఓ రవి పర్యవేక్షించారు.

# కొత్త తిమ్మాపురంలో విద్యుత్ బాక్సు మార్చరా...?

## పిల్లల తల్లిదండ్రులు ఆందోళన

పుత్తూరురూరల్, సెప్టెంబరు 1 ప్రభాతవార్త:
పుత్తూరు మున్సిపాలిటీ 1వ వార్డు కొత్త తిమ్మాపురం గ్రామంలో వీధిలైట్లకు బోర్డు మున్సిపాలిటీ సిబ్బంది ఏర్పాటు చేశారు. ఆ కరెంటు బాక్సు చిన్న పిల్లలకు అందుతుందని, ఆ వీధిలోనే పిల్లలు ఆడుకుంటూ ఉంటారని ఏదైనా జరిగితే ఎలా అని కొత్త తిమ్మాపురం గ్రామ ప్రజలు మున్సిపల్ సిబ్బందికి మొత్తుకున్నా వారు పట్టించుకోకుండా కరెంటు స్థంభానికి పిల్లలకు అందే విధంగా కరెంటు బాక్సు అమర్చారని వారు ఆందోళన చెందారు. సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం తెలిపినా వారు



పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొత్త తిమ్మాపురం గ్రామంలోనే మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న కన్నివేలు, మణికంఠలకు ఈ సమస్య తెలిపినా వారు కూడా పట్టించుకోవడం లేదని వారు ఆ వీధి ప్రజలు వాపోతున్నారు. ఈ సమస్య ఉందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య 5 రోజులుగా ఉందని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ సిబ్బందికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. లేకుంటే పిల్లలకు, పెద్దలకు ప్రమాదం ఉందని తెలిపారు. ఇకనైనా మున్సిపల్ సిబ్బంది స్పందించి చర్యలు తీసుకోవాలని 1వ వార్డు గ్రామస్తులు కోరారు.

# నేడు ఎస్వీయూలో ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త:
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని సెప్టెంబర్ 2వ తేదీ 1954వ సంవత్సరం స్థాపించినప్పటి నుంచి 2-09-2024 తేదీ వరకు 70వ వ్యవస్థాపక దినోత్స వాన్ని జరుపుకోవడానికి సర్వం సిద్దం చేయడం జరిగిందని బోధ నేతల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ బోధనేతర సంఘం ఆధ్వర్యంలో మొట్ట మొదటిసారి 1984 వ సంవత్సరం నందు వ్యవస్థాపక దినోత్స వాన్ని నిర్వహించుటకు అప్పుడున్న అధికారుల అనుమతితో దిగ్విజయముగా జరుపుకుంటూ నేటికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బోధనేతర సంఘం ఆధ్వర్యంలో నే కొనసాగించడం జరుగుతుందన్నారు. వ్యవస్థాపిక దినోత్స వాన్ని పురస్కరించుకొని ఉద్యోగస్తులకు క్రీడలను, సాంస్కృతిక పోటీలను నిర్వహించి గెలిచిన వారికి బహుమతులను ఇవ్వటం 2023-24 వరకు పదవి విరమణ పొందిన బోధనేతర ఉద్యోగస్తులను ఘనంగా సత్కరించడం జరుగుతుందని చెప్పారు. ఈసారి కూడా పెద్ద సంఖ్యలో ఉత్స హంగా ఉద్యోగులు క్రీడలలో అలాగే సాంస్కృతిక కార్యక్రమాల పట్ల వారికున్న అభిలాషని చాటుకున్నారు. ఈ సారి మహిళలు ఎక్కువగా క్రీడలలో ఉత్స హంగా పాల్గొనడం విశేషం. 2వ తారీఖున ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉన్న మహనీయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, మా యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. సాయంకాలం 4:40 గం లకు శ్రీనివాస ఆడిటోరియం నందు ఆహ్లాదకర వాతావరణంలో కార్యక్రమాన్ని జరుపుకొనుటకు సర్వం సిద్ధం చేయడం జరిగింది. విశ్వవిద్యాలయాన్ని అభజవృద్ది పథంలో నడిపించడానికి విద్యార్థులు బోధన బోధనేతర సిబ్బంది అలాగే అధికారులు ఎల్ల వేళలా కృషి చేస్తున్న వారందిరికీ పేరేపేరునా మా సంఘం తరుపున ధన్యావాదాలు తెలుపుకుంటున్నామన్నారు.

# రాజీవ్‌నగర్‌లో నేడు ఆక్రమణలపై విచారణ

## బాధితులు సహకరించండి: ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 1 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలోని నిరుపేదల కోసం ఏర్పాటు చేసిన రాజీవ్‌నగర్‌లో కొందరు భూ రాబంధులు ఆక్రమణ పర్వాలను సాగిం చారని వారి భరతం పట్టడానికి విచారణకు ఆదేశించామని సోమ వారం నుంచి రెవెన్యూశాఖ బృందాలు ఇంటింటికి సర్వేలు చేయను న్నారని లబ్దిదారులు, బాధితులు సహాకరించాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కబ్జా కోరల నుంచి ఆక్రమణలకు గురైన భూములను విడిపించి నిజమైన లబ్దిదారులకు న్యాయం చేయటమే లక్ష్యంగా ముందడుగు వేసామని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి వివరించారు. గతంలో వైకాపా భూరాబంధుల బారిన పడి నష్టపోయిన బాధితులు భయపడకుండా ముందుకు వచ్చి తమ బాధలను తమకు జరిగిన అన్యాయాన్ని వివరించాలని పిలుపు నిచ్చారు. విచారనలో ఎటువంటి రాజకీయ వత్తిడులు రాజీలు, రాజకీయ ప్రమేయాలు, వత్తిడులుండవని అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరుపుతారని అలాగే నిర్వహించుటకు



తాను ఆదేశించినట్లు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.

### విచారణ తీరు:

రాజీవ్‌నగర్‌లో గతంలో మంజూరు చేసిన 7వేల ఇళ్ళకు సంబంధించి ఇంటింటికి వెళ్ళి విచారించుటకు 57 రెవెన్యూ బృందాలను నియమించినట్లు తహశీల్దార్ లక్ష్మీనారాయణ వివరించారు. వారు ఇంటింటికి వెళ్ళి విచారణ జరుపుతారన్నారు. ఆ విచారణ నివేదికలను తమ వద్ద ఉన్న లబ్దిదారుల జాబితాలతో సమన్వయం చేసి నిగ్గు తేల్చనున్నట్లు వివరించారు. గతంలో ప్రభుత్వం పట్టా ఎవరికి జారి చేసింది. ప్రస్తుతం ఆ పట్టాకు సంబంధించిన ఇంటిలో ఎవరున్నారనే అంశాలను సేకరిస్తామని వివరించారు.

### నివాశస్తుల గుండెల్లో గుబులు:

శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ 2007లో ఏర్పడింది. అప్పటిలో పట్టాలు పొందిన వారు నేడులేదు. కారణం అభివృద్ధి నత్తనడకన సాగటంతో పలువురు లబ్దిదారులు తమ పట్టాలను అమ్ముకున్నారు. కొనుగోలు చేసిన వారు ఇళ్ళు నిర్మించుకొని జీవిస్తున్నారు. అంతేకాక నాడు పట్టాల జారిలోనే కొందరు కౌన్సిలర్లు తమ హస్తలాఘం చూపి వందల పట్టాలు బినామి పేరుతో తయారు చేయించుకొని తమ వద్ద ఉంచుకున్నారు. ఇటీవల కాలంలో అమ్ముకున్నారు. అయితే కొనుగోలు చేసి ఇళ్ళు నిర్మించుకొని కాపురాలున్నారు. ప్రస్తుతం విచారణ అంటే మా పరిస్థితి ఏమిటని మధనపడుతున్నారు.